సాక్షి
నిర్మల్
గురువారం । 20 । ఏప్రిల్ । 2023



రోడ్డుకు మరమ్మతులెప్పుడో?

సారంగపూర్ మండలంలోని జామ్ నుంచి జీరవెల్లి గ్రామాల మధ్య ఏడు కిలోమీటర్ల మేర రెండేళ్ల క్రితం నిర్మించిన బీటీరోడ్డు అధ్వానంగా మారింది. 9లో▸

దరఖాస్తుల ఆహ్వానం

కుంటాల(ముధోల్): ప్రధాన మంత్రి కౌశల్ యోజన 4.0 కార్యక్రమంలో భాగంగా స్కిల్‌హబ్ స్కూల్‌గా కుంటాల ఆదర్శ పాఠశాలలను ప్రభుత్వం ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్ తెలిపారు. బ్యూటీ అండ్ వెల్‌నెస్‌పై శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆరోతరగతి నుంచి ఇంటర్ వరకు చదివి మానేసిన విద్యార్థులతో పాటు 15 నుంచి 45 సంవత్సరాల వారికి ఇవ్వనున్న శిక్షణకు అభ్యర్థులు ఈనెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం 9985541799 నంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
39.7 /26.4

జిల్లాలో ఆకాశంలో కొంతమేర మేఘాలు ఉంటాయి. పగటిపూట ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. వేడి, ఉక్కపోత కొనసాగుతూనే ఉంటుంది.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్		సహర్
గురు :	6:34	శుక్ర :	4:30

న్యూస్‌రీల్

పోషకాహారం సక్రమంగా అందించాలి

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి



విద్యార్థితో పాఠం చదివిస్తున్న కలెక్టర్

ముధోల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం సక్రమంగా అందించాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. బుధవారం ముధోల్‌లోని ఐసీడీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. కేంద్రాల్లో చిన్నారులకు అక్షర జ్ఞానంతో పాటు పోషకాహారం అందించాలన్నారు. అనంతరం కేజీబీవీని తనిఖీ చేసి విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీవో విజయలక్ష్మి, తహసీల్దార్ తుకారాం, సీడీపీవో శ్రీమతి, సర్పంచ్ రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

తానూరులో కలెక్టర్ పర్యటన

తానూరు: మండలంలోని ఉమ్రి(కే), తానూరు గ్రామాల్లో బుధవారం కలెక్టర్ వరుణ్ రెడ్డి పర్యటించారు. పల్లె ప్రకృతివనాలు, నర్సరీలను పరిశీలించారు. తానూరులోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానం రాబట్టారు. న్యూకాలనీలో తాగునీ టి సమస్య ఉందని కాలనీవాసులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామన్నారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ వెంకటరమణ ఉన్నారు.

వారసంత పరిశీలన

తానూరులో ప్రతీ మంగళవారం నిర్వహించే వారసంతలో సౌకర్యాలు లేక వ్యాపారులు ఇబ్బందులకు గురవుతున్నారని ఈ నెల 12న 'సాక్షి'లో 'వారసంత ..సమస్యలే అంత ' శీర్షికన కథనం ప్రచురితమైంది. కథనానికి స్పందించిన కలెక్టర్ వారసంత స్థలాన్ని పరిశీలించారు.

గడువులోగా మిల్లింగ్ చేసి అప్పగించాలి



రికార్డులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

భైంసాటౌన్/లోకేశ్వరం/నర్సాపూర్(జి): సీఎంఆర్ కోసం కేటాయించిన ధాన్యం గడువులోగా మిల్లింగ్ చేసి అప్పగించనిపక్షంలో సదరు రైస్ మిల్లర్లపై రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ రాంబాబు హెచ్చరించారు. బుధవారం భైంసా మండలంలోని దే గాం, లోకేశ్వరం మండలం ధర్మోరా గ్రామంలని రైస్‌మిల్, నర్సాపూర్(జి) మండలం అర్లి(కే) గ్రామాల్లోని రైస్‌మిల్లులను డీసీ ఎస్‌వో తనూజ, డీఎం శ్రీకళతో కలిసి తనిఖీ చే శారు. కేటాయించిన ధాన్యం, అప్పగించిన బి య్యం, ఇంకా అప్పగించాల్సిన బియ్యం, తది తర వివరాలు తనిఖీ చేశారు. 2021–22 యా సంగి సీజన్‌కు సంబంధించి సీఎంఆర్ 60 శా తం పూర్తయిందని, మరో 40 శాతం ఏప్రిల్ 30 లోగా పూర్తి చేయాలని మిల్లర్లకు సూచించారు. గడువులోగా పూర్తి చేయని పక్షంలో రెవెన్యూ చట్టం ప్రకారం రైస్‌మిల్లుల ఆస్తులను జప్తు చేస్తామన్నారు.

గెలుపే ధ్యేయంగా పనిచేయాలి



మాట్లాడుతున్న అయ్యన్నగారి భూమయ్య

నిర్మల్‌చైన్‌గేట్: రానున్న లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా ప్రతీ కార్యకర్త పని చేయాలని బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య అన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రతీ ఇంటికి చేరేలా చూడాలన్నారు. పార్టీ పెద్దపల్లి ఇన్‌చార్జి రావుల రాంనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మె రాజు, అసెంబ్లీ కన్వీనర్ మురళి, జిల్లా ఉపాధ్యక్షుడు కమల్ నయన్, జిల్లా కార్యదర్శి కొరిపెల్లి శ్రావణ్‌రెడ్డి, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ కొండాజీ శ్రావణ్, పట్టణ ప్రధాన కార్యదర్శి భాస్కర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి దత్తత



నిర్మల్‌లో పనులు చేపడుతున్న విద్యుత్ సిబ్బంది



జిల్లా కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయం

జిల్లాలో 27 గ్రామాలను దత్తత తీసుకున్న విద్యుత్ అధికారులు

- రూ.3.50 కోట్ల నిధులు అవసరమని అంచనా
- ఇప్పటికే జిల్లాకు రూ.2.50 కోట్లు మంజూరు
- జూన్ చివరి వరకు తొలగిపోనున్న సమస్యలు

లక్ష్మణచాంద(నిర్మల్): జిల్లాలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు జిల్లా విద్యుత్‌శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగానే విద్యుత్ శాఖ అధికారులు ఇటీవల జిల్లాలోని 27 గ్రామాలను దత్తత తీసుకున్నారు. ఆయా గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కారంకోసం రూ.3 కోట్ల 50 లక్షలు అవసరమని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించారు. ప్రస్తుతం రూ.2.50 కోట్ల నిధులు విడుదలయ్యాయి. జూన్ చివరి వరకు ఆయా గ్రామాల్లో విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొంటున్నారు.

జిల్లాలో దత్తత గ్రామాలు ఇవే..

జిల్లాలో నెలకొన్న విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు ఆశాఖ అధికారులు 27 గ్రామాలను దత్తత తీసుకున్నారు. ఇందులో ఏఈ స్థాయి నుంచి ఏడీఈ స్థాయి వరకు ఒక్కో అధికారి ఒక గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. ఇందులో జిల్లా కేంద్రంలోని గాజుల్‌పేట్, ఆదర్శనగర్, సోన్ మండలంలోని జాఫ్రాపూర్, సోన్, నిర్మల్ రూరల్ మండలంలోని నీలాయిపేట్, లక్ష్మణచాంద మండలంలోని బోరిగాం, దిలావర్‌పూర్ మండలంలోని గుండంపెల్లి, దిలావర్‌పూర్, సారంగాపూర్ మండలంలోని స్వర్ణ, గొడిసెర, కొట్ల(బి), ఖానాపూర్ మండలంలోని పాత ఎల్లాపూర్, మామడ మండలంలోని మామడ, కడెం మండలంలోని లింగాపూర్, పెంబి మండలంలోని శెట్‌పెల్లి, దస్తురాబాద్ మండలంలోని దస్తురాబాద్, భైంసా పట్టణంలోని సంతోష్‌నగర్, భైంసా రూరల్ మండలంలోని హస్గుల్, చింతల్‌బోరి, వట్టోలి, కుంటాల మండలంలోని కల్లూర్, లింబాకే, కుభీర్ మండలంలోని పార్డి(బి), బాసర మండలంలోని వోని, ముధోల్ మండలంలోని విట్టోలి(బి), గన్నోర, తానూర్ మండలంలోని ఎల్వీ, లోకేశ్వరం మండలంలోని లోకేశ్వరం గ్రామాలను దత్తత తీసుకున్నారు.

రెండు విధాలుగా పనులు..

చేపట్టనున్న పనులు ఇవే..

1. లూజ్ వైర్లు సరిచేయడం.
2. అవసరం ఉన్నచోట మిడిల్ పోల్స్ వేయడం.
3. డ్యామేజ్ పోల్స్ గుర్తించి వాటిస్థానంలో కొత్త పోల్స్ వేయడం.
4. అవసరం ఉన్నచోట కొత్తగా పోల్స్ వేయడం.
5. గ్రామాల్లో ఏ ఇతర సమస్యలు ఉన్నా వాటిని గుర్తించి పరిష్కరించడం.

ఆయా గ్రామాల్లో చేపట్టనున్న పనులను నాన్ ఫైనాన్షియల్ పనులు, ఫైనాన్షియల్ పనులుగా గుర్తించారు. నాన్ ఫైనాన్షియల్ పనులు అంటే మీటర్ ఇంటిలోపల ఉంటే దానిని ఇంటి వెలుపల బిగించడం, లూజ్‌వైర్లు సరిచేయడం వంటి పనులు. ఫైనాన్షియల్ పనులు అంటే నూతనంగా స్తంభాలు వేయడం వంటి పనులు. నాన్ ఫైనాన్షియల్ పనులు ఇప్పటికే అన్ని గ్రామాల్లో పూర్తి చేశామని, ఇటీవలే నిధులు వచ్చినందువల్ల ఫైనాన్షియల్ పనులు కూడా త్వరలోనే ప్రారంభిస్తామని విద్యుత్‌శాఖ ఎస్‌ఈ చవాన్ తెలిపారు.

సంతోషంగా ఉంది



విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం అధికారులు మా గ్రామాన్ని దత్తత తీసుకోవడం సంతోషంగా ఉంది. అధికారులు ఇప్పటికే సర్వే చేసి గ్రామంలో నెలకొన్న సమస్యలు గుర్తించారు. త్వరలోనే పనులు పూర్తి చేస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

– అనిల్, బోరిగాం

జూన్ చివరి వరకు పూర్తి చేస్తాం



జిల్లాలో 27 గ్రామాలను దత్తత తీసుకున్నాం. ఆయా గ్రామాల్లో విద్యుత్ సమస్యల పరిష్కారానికి రూ.3.50 కోట్లు అవసరమని ప్రభుత్వానికి నివేదించాం. ప్రస్తుతం రూ.2.50 కోట్లు విడుదలయ్యాయి. దత్తత గ్రామాల్లో ఇదివరకే నాన్ ఫైనాన్షియల్ పనులు పూర్తిచేశాం. ఫైనాన్షియల్ పనులు కూడా త్వరలోనే ప్రారంభించి జూన్ చివరి వరకు పూర్తిచేస్తాం. విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటాం. – జేఆర్ చవాన్, ఎస్‌ఈ, విద్యుత్‌శాఖ

పట్టణాన్ని మరింత అభివృద్ధి చేస్తాం

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్‌టౌన్ : నిర్మల్ పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసి చూపిస్తామని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో పురపాలక సంఘం అత్యవసర సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన మంత్రి మాట్లాడుతూ త్వరలోనే సీఎం కేసీఆర్ జిల్లాకు రానున్నారని, మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.100 కోట్ల నిధులు కేటాయించాలని విన్నవిస్తానన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, కమిషనర్ ఏవీఎస్ రాజు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

జిల్లా కేంద్రంలోని సోఫీనగర్‌లో విశ్వకర్మ ఉద్యోగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మే 22న నిర్వహించనున్న శ్రీ మద్విరాట్ విశ్వకర్మ భగవాన్ శిలా విగ్రహ ప్రతిష్ఠాపన పోస్టర్‌ను మంత్రి క్యాంపు కార్యాలయంలో ఐకేరెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో వేవా జిల్లా అధ్యక్షుడు గాంధారి ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి పూర్ణచందర్, కోశాధికారి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ ఆకోజికిషన్, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి కృషి

మామడ(నిర్మల్): మైనార్టీల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పొన్కల్‌లో ముస్లింలతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి, నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ, రైతుబంధు మండల అధ్యక్షుడు గంగారెడ్డి, బీఆర్ఎస్ కన్వీనర్ చంద్రశేఖర్ గౌడ్, రఫీ, పాషా, అజాం, శేఖర్, లింగారెడ్డి, ఫసి, తదితరులు పాల్గొన్నారు.

మానని గాయం

- ఇంద్రవెల్లి ఘటనకు 42 ఏళ్లు
- నేడు అమరవీరుల సంస్మరణ దినోత్సవం
- ఉమ్మడి జిల్లా నుంచి తరలిరానున్న ఆదివాసీలు
- హాజరుకానున్న ఎంపీ సోయం బాపూరావ్, ములుగు ఎమ్మెల్యే సీతక్క, వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల

సాక్షి ఆదిలాబాద్ /ఇంద్రవెల్లి: 1981 ఏప్రిల్ 20... జల్.. జంగల్.. జమీన్ కోసం ఉద్యమించిన అడవిబిడ్డలపై అప్పటి సర్కారు తుపాకీ ఎక్కుపెట్టింది. తూటాల వర్షం కురిపించింది. హక్కుల సాధనలో 13 మంది (అధికారికంగా) గిరిజనులు అమరులయ్యారు. వారి రక్త పుటేరులతో తడిసిన వనసీమ ఎర్రబారింది. అడవిబిడ్డల అమరత్వం నింగికెగిసిన అగ్నిశిఖలా ఇంద్రవెల్లిలో అమరుల స్తూపమై నిలిచింది. ఈ ఘటనకు 42 ఏళ్లు. అయితే అమరుల సంస్మరణ దినంను అధికారికంగా నిర్వహించాలని ఆదివాసీ నాయకులు ఏటా వినతులు సమర్పిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కేవలం రెండు గంటలు మాత్రమే బందోబస్తు నడుమ అనుమతిస్తున్నారు. ఈ సారి కూడా అదే పరిస్థితి. ఈ నేపథ్యంలో నేటి కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా నుంచి ఆదివాసీలతో పాటు ఎంపీ సోయం బాపూరావ్, ములుగు ఎమ్మెల్యే సీతక్క, వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల హాజరుకానున్నారు. ఇప్పటికే స్తూపం వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.



సంస్మరణ దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేసిన ఆదివాసీలు

నా భర్తను కోల్పోయిన..



నాటి ఘటనలో నా భర్త కొద్దు మరణించాడు. తరువాత చాలా కష్టాలు పడ్డా. కూలి పనులు చేసుకుంటూ కొడుకు మోహపత్‌రావ్‌ను పెంచిన. కానీ ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందలేదు. ఇప్పటికైనా స్పందించి ఆర్థికసాయంతో పాటు డబుల్ బెడ్ రూమ్ మంజూరు చేసి ఆదుకోవాలి.


– సేడ్మాకి లచ్చుబాయి, తాటిగూడ

కుడిచేతికి తూటా గాయమైంది..



నాడు పోలీసుల కాల్పుల్లో నా కుడిచేతికి తూటా గాయమైంది. ఆ కారణంగా ఇప్పటికీ ఏ పని చేయలేకపోతున్న. ఆ సంఘటన తరువాత నా భర్త శంభు అనారోగ్యంతో చనిపోయిండు. ఉన్న ఒక్కగానొక్క కొడుకు జంగు కూడా అనారోగ్యంతోనే ఈ లోకం విడిచి పోయిండు. కోడలు యేత్మబాయి వద్ద ఉంటూ కాలం వెళ్లదీస్తున్నా. నడవలేక పోతున్నా. నా కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి.

– మడావి జంగుబాయి, కన్నాపూర్



స్తూపం వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకం

నాటి అమరులు వీరే..

నాడు పోలీసుల కాల్పుల ఘటనలో గాయాలతో వెళ్లి తమ తమ గ్రామాల్లో సుమారు 60 మంది వరకు చనిపోయినట్లు నాటి తరం వారు చెబుతున్నారు. ప్రస్తుతం ఆదివాసీ సంఘాల సర్వే ప్రకారం 20 మంది అమరుల వివరాలు సేకరించారు. ప్రభుత్వం మాత్రం కేవలం 13 మంది మాత్రమే అమరులైనట్లు ప్రకటించింది.

ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని పిట్టబొంగరం గ్రామానికి చెందిన మడావి రాము, కోట్నాక్ గాగ్రు, మండాడి జంగు, ఎర్మ దేవ్‌రావ్, వెట్టి ఇస్రుబాయి, వడగామ్ గ్రామానికి చెందిన కనక సోము, కోయల్‌పాండ్రి గ్రామానికి చెందిన సెడ్మకి కొద్దు, జోర్‌పల్లి గ్రామానికి చెందిన తొడసం భీంరావ్, కన్నాపూర్ గ్రామానికి చెందిన కుమురం కొద్దు, నిజాంగూడ గ్రామానికి చెందిన పెందోర్ దేవ్‌రావ్, జాకిట్‌గూడ గ్రామానికి చెందిన డోంగురావ్, ఎగోతిరావ్ ఉన్నారు. అలాగే గౌరపూర్ గ్రామానికి చెందిన ముత్తు, డోంగర్‌గాం గ్రామానికి చెందిన కోవ రాము, బోరుజ్‌గూడ గ్రామానికి చెందిన హెరేకుమ్ర జంగు, మోహన్‌గూడ గ్రామానికి చెందిన ఆర్క గంగు, బంగారుగూడ గ్రామానికి చెందిన సిడాం బాపూరావ్, మామిడిగూడ గ్రామానికి చెందిన మెస్రం సురేష్, ఇచ్చోడ మండలం సోన్‌పల్లి గ్రామానికి చెందిన పెందోర్ బందు, సిరికొండ మండలం పొండుగూడకు చెందిన పెందోర్ గంగులు ఉన్నారు. వీరే కాకుండా మరికొందరు గాయాలతో ఇళ్లకు వెళ్లి అమరులయ్యారని ఆదివాసీ నాయకులు చెబుతున్నారు.

మృత్యుంజయులుగా ..

ఆ పర్వతాలు ఎరుపు.. అక్కడి పువ్వులు ఎరుపు.. వారి మరణం ఎరుపు.. మా నివాళి ఎరుపే.. ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపంపై మనకు ఈ అక్షరాలు కనిపిస్తాయి. తమ హక్కుల కోసం ఆ నాడు ఉద్యమించి వీరమరణం పొందిన వారిని ఆదివాసీలు ప్రజావీరులుగా.. మృత్యుంజయులుగా భావిస్తూ ఏటా స్మరించుకుంటారు. మరోసారి ఆదివాసీ గిరిజనులు ఇంద్రవెల్లి అమరవీరుల సంస్మరణానికి సిద్ధమయ్యారు. ఇదిలా ఉంటే గతంలో యూపీఏ ప్రభుత్వ హయాంలో ఇంద్రవెల్లి స్మారక స్తూపం స్థలాన్ని జలియన్ వాలా బాగ్ తరహాలో అభివృద్ధి చేస్తామని చెప్పినప్పటికీ ముందడుగు పడలేదు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు కూడా ఆ దిశగా చర్యలు చేపట్టలేదు.

ఆ రోజు ఏం జరిగిందంటే..

అది 1981 ఏప్రిల్ 20. నాడు జల్.. జంగల్.. జమీన్.. నినాదంతో పాటు అటవీ అధికారులు, షావుకార్ల దౌర్జన్యం నశించాలనే డిమాండ్‌తో గిరిజన రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ఇంద్రవెల్లిలో సభ ఏర్పాటు చేశారు. దీనికి పీపుల్స్‌వార్ మద్దతునిచ్చింది. అప్పట్లో ప్రభుత్వం సభ నిర్వహణకు అనుమతినిచ్చినట్టే ఇచ్చి ఆ తర్వాత రద్దు చేసింది. విషయం తెలియక ఆదివాసీ గూడాల నుంచి పెద్ద ఎత్తున సభకు తరలివచ్చారు. సభ స్థలాన్ని ఖాళీ చేయాలని పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. ఈ క్రమంలో ఆదివాసీలు, పోలీసుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. ఈ దశలో పోలీసులు కాల్పులు జరపడంతో పలువురు ఆదివాసీలు మృతి చెందారు.

ఇప్పటికీ అవే డిమాండ్లతో పోరాటం..

ఏజెన్సీ ప్రాంతాల్లో నేటికీ జల్ జంగల్ జమీన్ పోరాటాలు కొనసాగుతున్నాయి. 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆదివాసీలు డిమాండ్ చేస్తున్నారు. లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని కోరుతున్నారు. ఇప్పుడప్పుడు పంపిణీ చేస్తామని చెబుతూ దాటవేస్తున్న పోడు పట్టాల అంశంపై ఆదివాసీలు మండిపడుతున్నారు. గత జనవరిలో నాగోబా జాతర సందర్భంగా ఇంద్రవెల్లి మండలానికి వచ్చిన రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ త్వరలోనే పోడు పట్టాల పంపిణీ ప్రారంభిస్తామని చెప్పినప్పటికీ ఇప్పటికీ దానిపై కదలిక లేకపోవడం పట్ల ఆదివాసీలు మండిపడుతున్నారు.

స్తూపాన్ని అభివృద్ధి చేయాలి



అమరవీరుల స్తూపం అభివృద్ధిపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి. నాటి కేంద్రమంత్రి జైరాం రమేశ్‌తో పాటు రాష్ట్ర మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు స్తూపాన్ని సందర్శించిన సమయంలో అభివృద్ధి చేస్తామని హామీలిచ్చి మరిచారు. దీంతో ఏటా ఆంక్షల నడుమ అమరులకు నివాళులర్పించాల్సిన పరిస్థితి.

– పుర్క బాపూరావ్, తుడుందెబ్బ ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి

అమరుల కుటుంబాలను ఆదుకోవాలి



స్తూపాన్ని అభివృద్ధి చేయడంతో పాటు అమరవీరుల కుటుంబాలను ఆదుకోవాలి. కుటుంబ పెద్దలను కోల్పోయిన అనేక కుటుంబాలు పోషణకు ఇబ్బందులకు గురయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబాలకు డబుల్ బెడ్ రూమ్ మంజూరు చేసి ఆదుకోవాలి.

– అర్క ఖమ్ము, ఆదివాసీ నాయకుడు

రెండోసారి స్మారక స్తూపం..

నాటి పోలీసు కాల్పుల్లో అమరులైన ఆదివాసీల స్మారకార్థం నాడు రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో 80 అడుగుల స్తూపాన్ని నిర్మించారు. అయితే ఆ స్తూపాన్ని 1986 మార్చిలో గుర్తు తెలియని వ్యక్తులు డైనమేట్లతో పేల్చారు. దీంతో గిరిజనులు ఆందోళన చేయడంతో 1987లో ప్రభుత్వం ఐటీడీఏ నిధులతో రెండోసారి స్తూపాన్ని నిర్మించింది.

సడలని ఆంక్షలు

అమరులైన ఆదివాసీల స్మారకార్థం స్తూపాన్ని నిర్మించారు. ఆ తర్వాత ప్రభుత్వాలు స్తూపం వద్ద సంస్మరణ దినోత్సవం నిర్వహణపై నిషేధాజ్ఞలు విధించడంతో ఎన్నో ఏళ్ల పాటు ఏప్రిల్ 20 వచ్చిందంటే అక్కడ భారీ ఎత్తున పోలీసుల బందోబస్తు కనిపించేది. 2015 నుంచి తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా అనుమతి ఇవ్వకపోయినా ఆంక్షలు సడలించింది. అయితే పోలీసు బందోబస్తు మాత్రం అదే రీతిలో కనిపిస్తుంది.

పోలీసు బందోబస్తు

స్తూపం వద్ద ఏటా మాదిరిగానే ఈ సారి కూడా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. బుధవారం సాయంత్రమే పోలీసు బలగాలు ఇక్కడికి చేరుకున్నాయి. సుమారు 300 మందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ నాగేందర్ తెలిపారు. ఆదివాసీలు శాంతియుత వాతావరణంలో నివాళులర్పించాలని ఆయన కోరారు.



క్లుప్తంగా

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య


ఆడే శివ (ఫైల్)

కుంటాల: మండలంలోని అంబుగామనికి చెందిన ఆడే శివ (27) బుధవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై హన్మాండ్లు పేర్కొన్నారు. ఆయన వివరాల ప్రకారం... ఆడే శివ వ్యవసాయ కూలీ కాగా గత ఐదేళ్ల క్రితం ఆడే బేబిబాయితో వివాహం జరిగింది. వీరికి నాలుగు సంవత్సరాల కుమారుడు, ఐదు నెలల కుతూరు ఉంది. అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులు తాళలేక మనస్తాపానికి గురైన శివ బుధవారం వేకువజామున గుట్ట ప్రాంతంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆయిల్‌పామ్ సాగుకు మొగ్గు చూపాలి

తలమడుగు: లాభదాయకమైన ఆయిల్‌పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలని స్టేట్ కన్సల్టెంట్ బీఎన్ రావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం తలమడుగు మండలంలోని ఉండమ్ గ్రామంలో ఆయిల్ పామ్ సాగు చేసిన రైతు పంట పొలాల్లో క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. రైతులకు ఆయిల్‌పామ్ సాగులోని సందేహాలను తొలగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆయిల్ ఫామ్స్ చేసే రైతులకు ఉచిత విద్యుత్, డ్రిప్ అందించడం జరుగుతుందన్నారు. ఇందులో రామచంద్రరావు, కొమరం గ్రామ సర్పంచ్ కందిపోచ్చుబాయి. ఉద్యనవన శాఖ అధికారులు మహేష్, యోగిరాజు, రమేష్, శశిధర్, సతీష్, గణేష్, పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి


సల్మాన్ మృతదేహం

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ బాలుడు మృతిచెందిన సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... ఆదిలాబాద్ నుంచి ఇచ్చోడకు తండ్రితో కలిసి సల్మాన్ (12) ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. వారి వాహనాన్ని కారు అతివేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో బాలుడు సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. స్థానికుల సమాచారంతో 108 వాహన సిబ్బంది, పోలీసులు ఘటన స్థలం వద్దకు చేరుకున్నారు. ప్రమాదానికి గల కారణాలు పూర్తిగా తెలియరాలేదు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

ఆదిలాబాద్‌టౌన్: అప్పుల బాధతో మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా సావర్‌ఖేడ్‌కు చెందిన వాంఖడే ప్రభు(45) ఆత్మహత్యకు పాల్పడ్డారు. టూ టౌన్ పోలీసుల వివరాల ప్రకారం... ప్రభు తన సోదరుడైన వాంఖడే సంతోష్‌తో పాటు గ్రామస్తులతో కలిసి ఈ నెల 17న చంద్రాపూర్‌లోని మహంకాళి దర్శనానికి వెళ్లాడు. 18వ తేదీన సాయంత్రం తిరుగుపయనమైన సమయంలో ప్రభు పురుగుల మందుతాగాడు. ఆదిలాబాద్‌కు రాగానే వాంతులు చేసుకోగా అతడి సోదరుడు సంతోష్ ప్రశ్నించగా కూతురి పెళ్లికి చేసిన అప్పులు తీర్చే మార్గం లేక పురుగుల మందు తాగినట్లుగా తెలిపాడు. దీంతో అతడిని రిమ్స్‌కు తీసుకురాగా అప్పటికే మృతి చెందినట్లుగా వైద్యులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


అసంపూర్తిగా సబ్ రిజిస్టర్ కార్యాలయ భవనం


గోదాంగా వాడుకుంటున్న దృశ్యం


ఇరుకు గదిలో సబ్ రిజిస్టర్ కార్యాలయం..

అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నటువంటి సమీకృత కలెక్టరేట్ కార్యాలయ భవన నిర్మాణం నత్తనడకన సాగుతోంది. నాలుగేళ్లుగా కొనసాగుతూనే ఉంది. నిర్మల్ జిల్లా ఏర్పడి దాదాపు ఏడేళ్లు గడుస్తున్నప్పటికీ ప్రభుత్వ కార్యాలయాలు అన్నీ చాలీచాలని ఇరుకు గదుల్లో కొనసాగుతున్నాయి. జిల్లా ఏర్పాటైన సమయంలో కొన్ని కార్యాలయాల భవనాలకు శంకుస్థాపనలు చేసినప్పటికీ అవి అలాగే మిగిలిపోయాయి. రిజిస్ట్రేషన్ కార్యాలయ భవనానికి ఐదేళ్లుగా ఎలాంటి పురోగతి లేదు. ఓ ప్రైవేటు వ్యాపారి దానిని గోడౌన్ లాగా వాడుకుంటున్నాడు. - సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్


పాత భవనంలో డీపీవో కార్యాలయం


భూగర్భ జలశాఖ, తూనికలు కొలతల కార్యాలయం


అద్దె భవనంలో పౌర సరఫరాల అధికారి కార్యాలయం

ఎల్లపల్లిలో ఉద్రిక్తత

- అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి
- హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని ఆరోపణ
- ఆందోళనకు దిగిన బంధువులు
- పలువురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు


ఎల్లపెల్లిలో పోలీసుల బందోబస్తు

నిర్మల్‌రూరల్: మండలంలోని ఎల్లపల్లి గ్రామంలో మంగళవారం ఓ యువకుడు అనుమానాస్పద రీతిలో ఆత్మహత్యకు పాల్పడగా బంధువులు ఆందోళనకు దిగారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి స్వగ్రామం కావడంతో గ్రామంలో బుధవారం పోలీసులు భారీగా మోహరించారు. పోలీసుల కథనం ప్రకారం... ఎల్లపల్లి గ్రామానికి చెందిన అలకుంట నవీన్(19) గొర్రెల కాపరి. మంగళవారం గ్రామ శివారులోని ఓ చెట్టుకు అనుమానాస్పదంగా ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. గొర్రెలు మేపేందుకు వెళ్లిన నవీన్ అక్కడున్న ట్రాక్టర్ నడపడంతో అదుపుతప్పి చెట్టును ఢీకొట్టగా దెబ్బతిందని, దీంతో ట్రాక్టర్ యజమాని అశోక్ దాడి చేసి నవీన్‌ను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని అతడి తండ్రి ఎల్ల స్వామి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అశోక్‌తో పాటు గ్రామానికి చెందిన మరో నలుగురు వ్యక్తులు నవీన్‌ను హత్య చేసి కుటుంబ సభ్యులు ఆరోపించారు. అనంతరం నవీన్ కుటుంబ సభ్యులు బుధవారం అనుమానిత వ్యక్తుల ఇంట్లో చొరబడి ఫర్నిచర్ ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి, రూరల్ సీఐ, ఎస్సైలు గ్రామానికి చేరుకుని ఆందోళన విరమింపజేశారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఓ దశలో నవీన్ కుటుంబ సభ్యులు పోలీసులపై రాళ్లురువ్వారు. దీంతో పోలీసులు స్వల్ప లాఠీచార్జ్ చేసి ఇంట్లో ఫర్నిచర్ ధ్వంసం చేసిన పాల్పడిన ఐదుగురిని అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేశారు. నవీన్‌ది హత్యగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ జీవన్‌రెడ్డి హెచ్చరించారు.


పోలీసులకు ఆందోళనకారులకు మధ్య వాగ్వివాదం

తరోడ వద్ద లారీ ఓనర్ల ఆందోళన

- తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన
- ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే జోగు రామన్న హామీ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగు రామన్న

జైనథ్: ఇటీవల తరోడ బ్రిడ్జి కుంగిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని లారీ ఓనర్లు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం జాతీయ రహదారిపై కుంగిపోయిన తరోడ బ్రిడ్జి వద్ద ఉదయం ఆందోళనకు దిగారు. కార్లు, బైక్‌లు, ఆటోలు, ఇతర వాహనాల కోసం ప్రత్యామ్నాయంగా నిర్మించిన తాత్కాలిక వంతెన రోడ్డులో రాకపోకలు నిలిపివేశారు. ఈ సందర్భంగా లారీ ఓనర్లు మాట్లాడుతూ తాత్కాలిక వంతెన గుండా లారీలకు అనుమతి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జోగు రామన్న బ్రిడ్జి వద్దకు చేరుకుని లారీ ఓనర్లతో మాట్లాడారు. కాగా ప్రత్యామ్నాయంగా అడ-కంత రోడ్డు గుండా రాకపోకలు చేస్తుంటే కొంత మంది బీజేపీ నాయకులు లారీ డ్రైవర్లపై దాడులకు దిగుతున్నారని, లారీల అద్దాలు ధ్వంసం చేస్తున్నారని ఎమ్మెల్యేతో వాపోయారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ ప్రస్తుతం తరోడ బ్రిడ్జి రోడ్డు కేంద్రం పరిధిలో ఉందని, అయినప్పటికీ ఆందోళన చెందవద్దని, త్వరలోనే ప్రత్యామ్నాయ వంతెనతో పాటు అడ-కంత రోడ్డును రూ.40కోట్లతో విస్తరిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఉన్నారు.

తరోడ బ్రిడ్జిని పరిశీలించిన ఎస్పీ


వంతెన పరిశీలిస్తున్న ఎస్పీ

జైనథ్: లారీ ఓనర్లు తరోడ బ్రిడ్జి వద్ద ఆందోళన నేపథ్యంలో ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి బ్రిడ్జిని పరిశీలించారు. బుధవారం పోలీస్, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులతో కలిసి కుంగిన వంతెన వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాన్య ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. లారీ ఓనర్లు తరోడ బ్రిడ్జి గుండా తాత్కాలిక వంతెన కోసం డిమాండ్ చేస్తున్నారని అధికారులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అయితే లారీ ఓనర్లు సొంత నిధులతో మరో తాత్కాలిక వంతెన నిర్మించుకునేందుకు ముందుకు వస్తే ప్రజలకు ఇబ్బందులు లేకుండా పనులు చేపట్టాలని సూచించారు. డీఎస్పీ ఉమేందర్, సీఐ కోల నరేష్, ఎస్సై పెర్సిస్ బిట్ల, ఎన్‌హెచ్‌ఏఐ డీఈ సుభాష్ ఉన్నారు.

ఒకరికి ఏడు రోజుల జైలు

నిర్మల్‌టౌన్: గొడవకు కారణమైన వ్యక్తికి ఏడు రోజుల జైలు శిక్షతో పాటు రూ.1700 జరిమానా విధిస్తూ నిర్మల్ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ఆర్.అజయ్‌కుమార్ బుధవారం తీర్పునిచ్చారు. కోర్టు సమన్వయ అధికారి సక్రియ నాయక్ వివరాల ప్రకారం .. జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌కు చెందిన గోజే అతీష్ ఇంటి ప్రహరీ నిర్మాణం చేస్తుండగా అదే కాలనీకి చెందిన దోవర్ వెంకోబా అనే వ్యక్తి పని నిలిపివేశాడు. దీంతో అతీష్ పెద్ద మనుషుల వద్ద మూడుసార్లు పంచాయితీ నిర్వహించాడు. వెంకోబా గోడ నుంచి అతీష్ ఒక ఫీట్ వదిలి నిర్మాణం చేసుకోవడానికి ఒప్పందం కుదిరింది. పెద్ద మనుషులు ఆ ఒప్పంద పత్రాలపై ఇద్దరితో సంతకాలు చేయించుకున్నారు. అయినప్పటికీ 2015 డిసెంబర్ 30న ఉదయం సమయంలో అతీష్ గోడ కోసం పునాది తవ్వుతుండగా వెంకోబా వచ్చి చంపేస్తానని బెదిరించాడు. దీంతో బాధితుడు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్సై సునీల్‌కుమార్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణ ఆరుగురు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నేరం రుజువు చేయడంతో పై విధంగా తీర్పు వెలువడింది.

రేపు అడెల్లి ఆలయంలో ఒడిబియ్యం సేకరణకు వేలం

సారంగపూర్: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీఅడెల్లి మహాపోచమ్మ అమ్మవారికి భక్తులు సమర్పించే ఒడి బియ్యం సేకరణ హక్కుకు ఈ నెల 21వ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రవికిషన్ తెలిపారు. ఈవేలం పాటలో పాల్గొనే వ్యాపారులు గంట ముందుగా అధికారులు నిర్ణయించిన ధరావత్తు సొమ్ము చెల్లించి పాల్గొనాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

కడెం: మండలంలోని ధర్మాజీపేట్ గ్రామ సమీపంలోని మూలమలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పెద్దూర్ గ్రామానికి చెందిన రెంకల శంకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కడెం వైపు నుంచి ఖానాపూర్ వైపు బైక్‌పై వెళ్తుండగా మూలమలుపు వద్ద బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన శంకర్‌ను కుటుంబ సభ్యులు నిర్మల్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

అమ్మవారి ఆలయంలో పూజలు

భైంసా: బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారిని ఏఐసీసీ (ఓబిసి) జాతీయ కోఆర్డినేటర్ కత్తి వెంకటస్వామి, రాష్ట్ర కోఆర్డినేటర్ బండారి జనార్దన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి బాబు బంగారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా బాసర కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి జంగం రాజేందర్, పార్టీ కార్యకర్తలు నాయకులు వారిని శాలువాతో సత్కరించారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇళ్లు దగ్ధం

ఇంద్రవెల్లి: ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండు పెంకుటిల్లు దగ్ధమైన సంఘటన బుధవారం మండలంలోని ఏమాయికుంట గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన నల్లగంటి రవి, నలగంటి శ్రీనివాస్ కుటుంబ సభ్యులు. ఉదయం ఉపాధి పనులకు వెళ్లగా... ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు వ్యాపించాయి. స్థానికులు గమనించి మంటలను ఆర్పివేసిన ఫలితం లేకుండాపోయింది. అప్పటికే ఇంట్లోని వస్తువులు కాలిపోయాయి. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు ఆర్‌ఐ మెస్రం లక్ష్మణ్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటనలో రవి ఇంట్లో రూ.లక్ష, నల్లగంటి శ్రీనివాస్ ఇంట్లో రూ.70 వేల ఆస్తి నష్టం జరిగిందని ఆర్‌ఐ తెలిపారు.

వాహనాల వేలం


వాహనాల వేలం నిర్వహిస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో ఆదిలాబాద్ డివిజన్ ఎక్సైజ్ డెప్యూటీ కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు బుధవారం వివిధ ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన 14 మోటార్ సైకిళ్లు, మోపెడు, ఆటో రిక్షాకు బహిరంగ వేలం వేసినట్లు ఎక్సైజ్ సీఐ సంపత్ కృష్ణ తెలిపారు. 16 మంది కొనుగోలుదారులు ఈ వేలంలో పాల్గొన్నారు. శాఖ అధికారులు రూ.41వేలు నిర్ధారించగా రూ.128700 పలికినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పూజలు


పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

జైనథ్: మండల కేంద్రంలోని అతి ప్రాచీన శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి ఆలయాన్ని ఎమ్మెల్సీ గంగాధర్ గౌడ్ సందర్శించారు. బుధవారం ఎమ్మెల్యే జోగు రామన్నతో కలిసి ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాశస్త్యం, చరిత్రను అడిగి తెల్సుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు వారిని శాలువాతో సన్మానించారు.

సహజత్వం ఉట్టిపడేలా కొయ్యబొమ్మలు

- జిల్లా పరిశ్రమల శాఖ అధికారి నరసింహారెడ్డి


సర్టిఫికెట్లు అందజేస్తున్న నరసింహారెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ కళాకారులు తయారు చేసిన కొయ్యబొమ్మలు సహజత్వం ఉట్టిపడేలా ఉంటాయని జిల్లా పరిశ్రమల శాఖ అధికారి జీవీ నరసింహారెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని హస్తకళల ఎగుమతి ప్రోత్సాహక సంస్థ (ఈపీసీహెచ్)అంతర్జాతీయ లేస్ ట్రేడ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన గురుశిష్య హస్త శిల్ప ప్రశిక్షణ్ వర్క్ షాప్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన కళాకారులకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఈపీసీహెచ్ దక్షిణాది రాష్ట్రాల సంచాలకులు కలవకొలను నాగ తులసీరావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవడానికి ఈ శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. హస్తకళల పరిశ్రమ మీద ఆధారపడి జీవించే వారికి ఎల్లవేళలా పనికల్పించేలా ఈపీసీహెచ్ డైరెక్టర్ జనరల్ రాకేష్ కుమార్ కృషి చేస్తున్నారన్నారు.

మా కూతుర్ని కాపాడండి..


అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తీసుకువెళ్తున్న శ్రీనిధి తల్లి


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి శ్రీనిధి

- ప్రాణాలతో పోరాడుతున్న చిన్నారి
- ఇప్పటికే రూ.2లక్షలకుపైగా ఖర్చు
- తలలో గడ్డకట్టిన రక్తం
- చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలింపు
- దాతలు ఆదుకోవాలని తల్లిదండ్రుల వేడుకోలు

దిలావర్‌పూర్: ఆడుతూపాడుతూ తిరిగే చిన్నారి ఇటీవల అనారోగ్యానికి గురై మృత్యువుతో పోరాడుతోంది. నిరుపేద కుటుంబానికి చెందిన తల్లిదండ్రులు తమ బిడ్డను కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. దిలావర్‌పూర్‌కు చెందిన మీసాల ముత్యం, లక్ష్మి దంపతులకు ముగ్గురు సంతానం. వారిలో పెద్ద కూతురు శ్రీనిధి స్థానిక ప్రాథమిక పాఠశాలలో 2వ తరగతి చదువుతోంది. తండ్రి ముత్యం వికలాంగుడైనా ఒంటి కాలితో కుట్టు మిషన్ తొక్కుతూ కూలీగా పనిచేస్తున్నాడు. తల్లి బీడీలు చేస్తూ, వ్యవసాయ కూలీకి వెళ్తుంది. ఇటీవల శ్రీనిధి ఆరోగ్యానికి గురికాగా నిర్మల్ పట్టణంతో పాటు, నిజామాబాద్‌లోని పలు ఆస్పత్రులకు వెళ్లారు. అయినా నయం కాలేదు. ఇటీవల ఫిట్స్ రావడంతో రూ.2లక్షలకు పైగా అప్పు చేసి వైద్యానికి ఖర్చు పెట్టారు. తాజాగా ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు శ్రీనిధి ఆరోగ్య పరిస్థితి వివరించిన తీరు వారి గుండెలు పగిలేలా చేసింది. చిన్నారి తలలో రక్తం గడ్డలు కట్టినట్లు చెప్పారు. దీంతో తల్లిదండ్రులు ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. చికిత్సకు హైదరాబాద్‌కు వెళ్లాలని సూచించారు. ఇప్పటికే కూతురు వైద్యానికి అప్పులు చేసి చికిత్స చేయించినప్పటికీ మెరుగైన వైద్యం కోసం చేతిలో చిల్లిగవ్వ లేక తమ పాపను కాపాడాలని గ్రామస్తులను రోదిస్తూ వేడుకుంటున్నారు. స్పందించిన స్థానిక యువత సామాజిక మాధ్యమాల ద్వారా శ్రీనిధి ఆరోగ్యం, కుటుంబ పరిస్థితిని తెలియజేస్తున్నారు. దీంతో బుధవారం గ్రామానికి చెందిన పలువురు యువకులు రూ.50వేలకు పైగా సాయం అందజేశారు. దాతలు ఆర్థిక సాయం చేసి తమ కూతుర్ని కాపాడాలని ఆ నిరుపేద తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

మతాల మధ్య చిచ్చుకు మంత్రి ప్రయత్నం

- బీజేపీ పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రావుల రాంనాథ్


మాట్లాడుతున్న రావుల రాంనాథ్

సారంగపూర్: హిందువుల దేవాలయం పక్కనే ఈద్గా నిర్మాణం చేపట్టి స్థానిక మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి మతాల మధ్య చిచ్చుపెట్టడానికే ప్రయత్నిస్తున్నారని బీజేపీ పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రావుల రాంనాథ్ ఆరోపించారు. మండలంలోని పొట్య గ్రామంలో బుధవారం పర్యటించిన ఆయన అక్కడ కార్యకర్తలు, నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో వృత్తి నైపుణ్యతను పెంపొందించడానికి కేంద్ర శిక్షణ కేంద్రాన్ని జిల్లాకు కేటాయించిందన్నారు. ఇందుకు ప్రస్తుతం ఈద్గా నిర్మించిన ప్రదేశాన్ని ఎంపిక చేశారని పేర్కొన్నారు. మెజారిటీ హిందువుల దేవాలయం పక్కనే ఇలా ప్రార్థన మందిరం నిర్మించడంతో అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు విలాస్, చేరికల కమిటీ కన్వీనర్ భూపతిరెడ్డి, గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు వినోద్, నాయకులు సుధాకర్, సంతోష్, శ్రీనివాస్ ఉన్నారు.